సాక్షి కామారెడ్డి

శనివారం । 5 । ఏప్రిల్ । 2025



తెలంగాణలోనే సన్నబియ్యం..
దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణ లోనే సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం పేర్కొన్నారు.
- 9లో ▸



సమస్యలను పరిష్కరిస్తా..
ప్రజలు సమస్యలను తన దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.
- 9లో ▸

గరిష్టం/కనిష్టం
36.7 /19.6

వాతావరణం
ఉదయం ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. పగటి ఉష్ణోగ్రతలు పెరుగుతాయి. రాత్రి ఉక్క పోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

'ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలి'



బ్రాహ్మణపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పరిశీలిస్తున్న చందర్ నాయక్

గాంధారి : ఎల్‌ఆర్‌ఎస్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అధికారులకు సూచించారు. శుక్రవారం ఆయన గాంధారి మండలంలో పర్యటించారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఎల్‌ఆర్‌ఎస్ కాల్ సెంటర్‌ను పరిశీలించారు. ఎల్‌ఆర్‌ఎస్ ఫీజులో రాయితీ ఇచ్చే గడువును ప్రభుత్వం పొడిగించిందని, దీనిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిశీలించాలని అధికారులకు సూచించారు. అనంతరం బ్రాహ్మణపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని పరిశీలించారు. ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని, అనంతరం రేషన్ దుకాణంలో సన్నబియ్యం పంపిణీ ప్రక్రియను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రాజేశ్వర్, ఎంపీవో లక్ష్మీనారాయణ, ఆర్‌ఐ ప్రదీప్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కామారెడ్డి అర్బన్: గ్రామ పరిపాలన అధికారుల నియామకం కోసం అర్హులైన మాజీ వీఆర్వో, వీఆర్‌ఏలు ఈనెల 16వ తేదీవరకు దరఖాస్తు చేసుకోవాలని కలెక్టరేట్ పరిపాలనాధికారి ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు గూగుల్ ఫాం ద్వారా దరఖాస్తు చేసి, దాని ప్రతిని కలెక్టరేట్‌లో అందజేయాలని సూచించారు.

సెట్విన్‌లో శిక్షణకు..

కామారెడ్డి అర్బన్ : సెట్విన్‌లో వివిధ వృత్తి విద్యాకోర్సుల్లో శిక్షణకోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆ సంస్థ కామారెడ్డి సెంటర్ సమన్వయకర్త సయ్యద్ మోయిజుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. డీసీఏ, పీజీడీసీఏ, టాలీ, ఫొటోషాప్, జావా, టైలరింగ్, ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీషియన్, మగ్గం వర్క్, మెహందీ కోర్సుల్లో శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 73861 80456, 79891 59121 నంబర్‌లలో సంప్రదించాలని సూచించారు.

పంటల పరిశీలన



వాజిద్‌నగర్‌లో పంటను పరిశీలిస్తున్న డీఏవో తిరుమలప్రసాద్, అధికారులు

బిచ్కుంద: మండలంలో శుక్రవారం జిల్లా వ్యవసాయ అధికారి తిరుమల ప్రసాద్ పర్యటించారు. వాజిద్‌నగర్, పుల్కల్, గుండెనెమ్లిలలో వడగండ్ల వానతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని అన్ని మండలాల వ్యవసాయ అధికారులను ఆదేశించామన్నారు. గుండెనెమ్లిలో 50 ఎకరాలు, బండరెంజల్‌లో 65, వాజిద్‌నగర్‌లో 150, సీతారాంపల్లిలో 30, మానేపూర్‌లో 150, పుల్కల్‌లో 135, పెద్దదేవాడలో 40ఎకరాలలో వరి పంట దెబ్బతిన్నట్లు గుర్తించామని, పూర్తి వివరాలు సేకరిస్తున్నామని పేర్కొన్నారు.

'చిన్నారులపై దృష్టి సారించాలి'



బ్రాహ్మణపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో రిజిస్టర్లను పరిశీలిస్తున్న ప్రమీల

నిజాంసాగర్ : అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఎదుగుదలపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి ప్రమీల సూచించారు. శుక్రవారం ఆరేడ్, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో చిన్నారుల బరువులు, ఎత్తులకు సంబంధించిన రికార్డుల నిర్వహణను గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం నుంచి అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణులు, బాలింతలతో పాటు చిన్నారులకు సక్రమంగా అందించాలని సూచించారు. ఆమె వెంట ఈజీఎస్ ఏపీవో శివకుమార్, పంచాయతీ కార్యదర్శులు అంజయ్య, తుకారాం, అంగన్‌వాడీ టీచర్లు ప్రమీల, విజయలక్ష్మి తదితరులున్నారు.

పంట కాలువలు మాయం

765 డీ జాతీయ రహదారి విస్తరణలో డిజైన్ లోపాలతో నిజాంసాగర్ ప్రాజెక్టు కాలువలు మాయమవుతున్నాయి. మురుగునీటి కాలువల తొలగింపుతో ప్రజలకు ఇబ్బందులు తప్పటం లేదు. జిల్లాలోని రుద్రూర్ నుంచి మెదక్ వరకు జాతీయ రహదారిని విస్తరిస్తున్నారు. బాన్సువాడ నియోజకవర్గంలోని నస్రుల్లాబాద్ మండల కేంద్రం వద్ద నిజాంసాగర్ 25వ సబ్ కెనాల్ నుంచి వచ్చే డిస్ట్రిబ్యూటరీ కాలువ పూర్తిగా కనుమరుగైంది. అంకోల్ క్యాంప్ గ్రామం వద్ద మరో కాలువ సైతం కనుమరుగు కానుంది. వీటి కింద సుమారు 600 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాక్షి ఫోకస్
SAKSHI FOCUS

సోమేశ్వర్ గ్రామం వద్ద పూర్తయిన జాతీయ రహదారి సైడ్ డ్రెయిన్ పనులు



- 765 డీ జాతీయ రహదారి నిర్మాణం డిజైన్‌లో లోపాలు
- ప్రత్యామ్నాయ కాలువలు తీయాలంటున్న రైతులు
- మిషన్ భగీరథ పైప్‌లైన్ సమస్య వస్తే సర్వీస్‌రోడ్డు తవ్వాల్సిందే
- డీపీఆర్ తయారీలో తప్పిదాలతో తప్పని సమస్యలు

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: అభివృద్ధికి మార్గాలు రహదారులు. అయితే ఈ రహదారుల నిర్మాణానికి చేసిన డిజైన్‌లలో ఏ చిన్న లోపం ఉన్నా అనేక సమస్యలు తలెత్తుతాయి. నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్‌లోని రుద్రూర్ నుంచి మెదక్ వరకు నిర్మిస్తున్న 765 డీ జాతీయ రహదారి డిజైన్‌లో లోపాలతో రైతులకు, పలు గ్రామాల వాసులకు ఇబ్బందులు తలెత్తాయి. డీపీఆర్ (సమగ్ర ప్రాజెక్టు నివేదిక) తయారు చేసే సమయంలో చేసిన తప్పిదాలతో బాన్సువాడ నియోజకవర్గంలో పలు చోట్ల నిజాంసాగర్ పంట కాలువలు మాయమయ్యాయి. కొన్ని గ్రామాల వద్ద డ్రెయినేజీలు పోయాయి. గతంలో ఉన్న రోడ్డును ఇటీవల జాతీయ రహదారిగా మార్చాక మరింత వెడల్పుగా నిర్మిస్తున్నారు.

మొత్తం 30 మీటర్లు కాగా ఇందులో 10 మీటర్లు ప్రధాన రహదారి. కాగా ఇరువైపులా 2.5 మీటర్ల చొప్పున (మొత్తం 5 మీటర్లు) వర్షపు నీరు రోడ్డుపై నిలవకుండా బయటకు వెళ్లేందుకు గాను డ్రెయిన్లు, డ్రెయిన్ల తరువాత ఇరువైపులా 7 మీటర్ల చొప్పున సర్వీస్ రోడ్డు (మొత్తం రెండువైపులా కలిపి 14 మీటర్లు) నిర్మిస్తున్నారు. అయితే ఈ రహదారి విస్తరణలో నస్రుల్లాబాద్ మండల కేంద్రం వద్ద నిజాంసాగర్ 25వ సబ్ కెనాల్ నుంచి వచ్చే డిస్ట్రిబ్యూటరీ కాలువ పూర్తిగా కనుమరుగైంది. మరోవైపు ఇదే మండలంలోని అంకోల్ క్యాంప్ గ్రామం వద్ద ఉన్న డిస్ట్రిబ్యూటరీ కాలువ సైతం కనుమరుగు కానుంది. 500 మీటర్ల వెడల్పుతో ఉన్న ఈ కాలువలు కనుమరుగవుతుండడంతో రైతులకు నష్టం జరిగే పరిస్థితి ఏర్పడింది. వీటి కింది భాగంలో సుమారు 600 ఎకరాలకు సాగునీరు సరఫరా అవుతోంది. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆయా గ్రామాల మురుగునీటి కాలువలు సైతం తొలగించారు. దీంతో సమస్యలు తప్పడంలేదని గ్రామాల ప్రజలు చెబుతున్నారు.

నస్రుల్లాబాద్ వద్ద తాత్కాలికంగా తవ్విన పంట కాలువ



అంకోల్ క్యాంప్ వద్ద ప్రస్తుతమున్న పంట కాలువ. ఇది కూడా తొలగించనున్నారు

మిషన్ భగీరథ పైపులైన్ పైనే..

ఇక మిషన్ భగీరథ పైపులైన్లు ఉన్న చోటే పైభాగంలో జాతీయ రహదారికి సర్వీస్ రోడ్డు వేస్తున్నారు. దీంతో ఈ మిషన్ భగీరథ పైపులైన్ల లీకేజీలు, ఇతర రిపేర్లు చేయాల్సి వస్తే సర్వీసు రోడ్లను తవ్వాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇలాంటి సమస్యలను పట్టించుకోకుండా డీపీఆర్ తయారు చేయడమంటే శాఖల మధ్య ఏమాత్రం సమన్వయం లేకపోవడమేనని ఈ గ్రామాల ప్రజలు అంటున్నారు.

పరిష్కారం చూపాలి



జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చేపట్టిన పనులతో కొన్ని సమస్యలు తలెత్తాయి. మా ప్రాంతంలో 600 ఎకరాలకు సాగునీరందించే పంట కాలువ, గ్రామం నుంచి మురుగు నీరు బయటకు వెళ్లే డ్రెయినేజీలు లేకుండా పోయాయి. ఇక మిషన్ భగీరథ పైప్‌లైన్లు సర్వీసు రోడ్డు కిందికి వెళ్లాయి. భవిష్యత్తులో పైపులైన్‌లలో సమస్యలు ఏర్పడితే బీటీ రోడ్డు మొత్తం తవ్వాల్సిన పరిస్థితి. అప్పుడు అనుమతుల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తుంది. సంబంధిత శాఖల అధికారులు సమన్వయం చేసుకుని సమస్యలకు పరిష్కారం చూపాలి.

– వెంకటరమణ, మాజీ సర్పంచ్, అంకోల్ క్యాంప్



అంకోల్ క్యాంప్ గ్రామానికి వెళ్లే ఇంట్రావిలేజ్ పైప్‌లైన్



కామిశెట్టిపల్లి వద్ద ఉన్న 765డీ జాతీయ రహదారి

మక్కలు కొనేదెప్పుడో?

- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- ఎదురుచూస్తున్న రైతులు



భిక్కనూరు: మక్కల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించే విషయంలో సర్కారు మీనమేషాలు లెక్కిస్తోంది. దీంతో పంట దళారుల పాలవుతోంది. మద్దతు ధర దక్కక రైతులు నష్టపోవాల్సి వస్తోంది.

యాసంగి సీజన్‌లో జిల్లాలో 35,134 ఎకరాల్లో మక్కపంట సాగయ్యింది. పక్షం రోజులుగా పంటను కోసి ఆరబెడుతున్నారు. అయితే సర్కారు కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో వ్యాపారులను ఆశ్రయించాల్సి వస్తోంది. కేంద్ర ప్రభుత్వం మక్కలకు క్వింటాలుకు రూ. 2,225 మద్దతు ధరను ప్రకటించింది. మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు ఈ మద్దతు ధర లభించేది. కానీ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాకపోవడంతో రైతులు వ్యాపారులకు విక్రయిస్తున్నారు. వారు క్వింటాలుకు రూ. 2,100 మాత్రమే చెల్లిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే మక్కల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం



మక్కల కొనుగోలు కేంద్రాలు లేకపోవడంతో దళారులకు అమ్ముకోవాల్సి వస్తోంది. వారు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని మార్క్‌ఫెడ్ అధికారులు, చైర్మన్‌ను కోరాం. ప్రభుత్వంనుంచి ఆదేశాలు రావాల్సి ఉంటుందంటున్నారు. త్వరగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయోగంగా ఉంటుంది.

– వెంకట్‌రెడ్డి, విండో చైర్మన్, అంతంపల్లి

రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో ఉన్నాం

- రేషన్‌షాప్‌లకు 99 శాతం సన్న బియ్యం సరఫరా చేశాం
- మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో వీసీలో కలెక్టర్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : రేషన్ షాప్‌లకు సన్నబియ్యం సరఫరా చేయడంలో రాష్ట్రంలోనే కామారెడ్డి జిల్లా ప్రథమ స్థానంలో ఉందని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి శుక్రవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్లతో మాట్లాడారు. సన్న బియ్యం సరఫరాపై సమీక్షించారు. ప్రజలు సన్నబియ్యాన్ని సంతోషంగా స్వీకరిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. పెద్ద మొత్తంలో నిధులు ఖర్చు చేసి ప్రజలకు బియ్యం సరఫరా చేసినా కూడా గతంలో 70 నుంచి 80 శాతం వరకు ప్రజలు దొడ్డు బియ్యాన్ని తినేవారు కాదన్నారు. రీసైక్లింగ్ ద్వారా కోళ్ల ఫారాలకు, ఇతర అవసరాలకు తరలి వెళ్లేదని పేర్కొన్నారు. దీనిని గమనించి రాష్ట్ర ప్రభుత్వం సన్న బియ్యం ఉచితంగా సరఫరా చేసే కార్యక్రమం చేపట్టిందన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా చూడాలన్నారు. రేషన్ షాపులకు సన్న బియ్యం సరఫరాను వేగవంతం చేయాలని ఆదేశించారు. సన్న బియ్యం రవాణాపై కలెక్టర్‌లు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, కాంట్రాక్టర్లతో సమావేశం నిర్వహించాలని సూచించారు. వీసీ అనంతరం కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలోని 578 రేషన్ దుకాణాలకు 5,571.80 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. ఇప్పటికే 5,527.04 (99.2 శాతం) మెట్రిక్ టన్నులు సరఫరా చేశామని పేర్కొన్నారు. సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఈనెల 15లోగా పూర్తి చేయాలని సూచించారు. నిరుపేద లబ్ధిదారుల ఇళ్లలో భోజనం చేయడానికి ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ వి.విక్టర్, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

- అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలి
- కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి క్రైం : యాసంగి సీజన్‌కు సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులకు సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయా శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లకోసం 446 కేంద్రాలను ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటి వరకు 33 కేంద్రాలను ప్రారంభించామని, ధాన్యం సేకరణ మొదలుపెట్టి 686 టన్నుల ధాన్యాన్ని సేకరించి మిల్లులకు తరలించామని పేర్కొన్నారు. మిగతా కొనుగోలు కేంద్రాలను త్వరగా ప్రారంభించాలన్నారు. అవసరమైన టార్పాలిన్లు, తూకం మిషన్లు, తేమ కొలిచే యంత్రాలు, ప్యాడీ క్లీనర్స్, క్యాలీపర్స్‌లను అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. సేకరించిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించాలన్నారు.

రేషన్ కార్డుల దరఖాస్తులను పరిశీలించాలి

పట్టణ ప్రాంతాల్లో రేషన్ కార్డుల దరఖాస్తుల పరిశీలనను వార్డు అధికారులు చేపట్టాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశించారు. శుక్రవారం తన చాంబర్‌లో జిల్లాలోని మున్సిపల్ కమిషనర్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన దరఖాస్తులను జీపీ కార్యదర్శులు పరిశీలించాలన్నారు. మీ సేవ కేంద్రాల ద్వారా వచ్చిన వాటిని రెవెన్యూ సిబ్బంది పరిశీలించాలని సూచించారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సరిచూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను పంచాయతీ కార్యదర్శులు, పట్టణ ప్రాంతాల్లో వార్డ్ ఆఫీసర్స్ పరిశీలించాలన్నారు. సమావేశంలో కామారెడ్డి, బాన్సువాడ, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్‌లు రాజేందర్‌రెడ్డి, శ్రీహరి, మహేశ్, సిబ్బంది పాల్గొన్నారు.

జొన్న కొనుగోలు కేంద్రాలకోసం..

జిల్లాలో 15 జొన్నల కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే జొన్న కొనుగోళ్లు ప్రారంభించాలని అధికారులకు సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వి.విక్టర్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డీఎం రాజేందర్, డీఎస్‌వో మల్లికార్జున్ బాబు, జిల్లా సహకార అధికారి రామ్మోహన్, మార్కెటింగ్ అధికారి రమ్య, మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ మహేశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

దొడ్డు బియ్యం.. ఏం చేయాలి?

- రేషన్ షాపుల్లో భారీగా నిల్వలు
- తరలింపు విషయంలో స్పష్టత కరువు
- నిల్వ చేయడానికి ఇబ్బంది పడుతున్న రేషన్ డీలర్లు

ఎల్లారెడ్డి : ప్రభుత్వం ఈనెలనుంచి రేషన్ షాప్‌ల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తోంది. అయితే నిల్వ ఉన్న దొడ్డు బియ్యం ఏం చేయాలన్న విషయమై ఇప్పటివరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. దీంతో వాటిని ఏం చేయాలో తెలియక రేషన్ డీలర్లు ఇబ్బందిపడుతున్నారు.

జిల్లాలోని 578 రేషన్ దుకాణాలున్నాయి. వీటి ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేయడానికి రేషన్ దుకాణాలకు 5,571 మెట్రిక్ టన్నుల సన్నబియ్యం సరఫరా చేయాల్సి ఉండగా.. ఇప్పటికే దాదాపుగా మొత్తం బియ్యాన్ని సరఫరా చేసింది. పంపిణీ ప్రారంభించిన నాలుగు రోజుల్లోనే 55 శాతం లబ్ధిదారులు బియ్యం తీసుకున్నట్లు అధికారులు చెబుతున్నారు. సన్నబియ్యం పంపిణీ జోరుగా సాగుతున్నా.. తమ వద్ద ఉన్న దొడ్డు బియ్యం నిల్వలను ఏం చేయాలన్న విషయమై ప్రభుత్వం నుంచి ఆదేశాలు లేకపోవడంతో రేషన్ డీలర్లు అయోమయంలో ఉన్నారు. జిల్లాలోని రేషన్ షాప్‌లలో గతనెలకు సంబంధించి సుమారు 500 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యం నిల్వ ఉన్నట్లు తెలుస్తోంది. తమ వద్ద ఉన్న దొడ్డు బియ్యం స్టాక్ వివరాలను రేషన్ డీలర్లు గతనెల 20వ తేదీలోగానే పౌర సరఫరాల శాఖ అధికారులకు అందించారు. ఎల్లారెడ్డి మండలంలోని 29 రేషన్ షాపుల్లో 337.22 క్వింటాళ్ల దొడ్డు బియ్యం నిల్వ ఉన్నాయి. ఈ కోటా ఖాళీ కాకముందే రాష్ట్ర ప్రభుత్వం సన్నబియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఎంఎల్‌ఎస్ పాయింట్లలోనూ భారీగా దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నట్లు తెలుస్తోంది. తమ దుకాణాలలో పాత స్టాకు ఖాళీ కాకముందే సన్న బియ్యం స్టాకు రావడంతో పాత స్టాకును ఎక్కడ పెట్టాలో తెలియక డీలర్లు ఇబ్బంది పడ్డారు. అంతేగాక దుకాణంలో దొడ్డు బియ్యం నిల్వలు ఉన్నందున సన్నబియ్యంలో దొడ్డు బియ్యాన్ని కలిపి ఇస్తున్నారా అని లబ్ధిదారులు అనుమానిస్తున్నారని రేషన్ డీలర్లు పేర్కొంటున్నారు. రేషన్ దుకాణాలలో మిగిలిపోయిన దొడ్డు బియ్యం నిల్వలను సాధ్యమైనంత తొందరగా వెనక్కి తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



ఎల్లారెడ్డిలోని ఓ రేషన్ దుకాణంలో నిల్వ ఉన్న దొడ్డు బియ్యం

ఆదేశాలు రావాల్సి ఉంది

జిల్లాలోని రేషన్ దుకాణాలు, ఎంఎల్‌ఎస్ పాయింట్లలో దొడ్డు బియ్యం నిల్వలున్నాయి. వాటి విషయంలో ప్రభుత్వంనుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటాం.

– మల్లికార్జున్ బాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి

ఔట్‌సోర్సింగ్ నియామకాలను రద్దు చేయాలి

- విద్యార్థి సంఘాల డిమాండ్
- మెడికల్ కళాశాల, కలెక్టరేట్‌ల వద్ద ధర్నా

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మెడికల్ కాలేజీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల భర్తీలో అక్రమాలు చోటు చేసుకున్నాయని, వాటిని తక్షణమే రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, ఆయా ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకున్నవారు డిమాండ్ చేశారు. ఈ డిమాండ్‌తో శుక్రవారం మెడికల్ కాలేజీని ముట్టడించారు. కలెక్టరేట్ వద్ద ధర్నా చేపట్టారు. దేవునిపల్లి పోలీసులు ఆందోళనకారులను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షుడు అరుణ్ మాట్లాడుతూ మ్యాన్ పవర్ అనే సంస్థ 45 ఉద్యోగాలను అమ్ముకుని, అర్హులైన వారికి అన్యాయం చేసిందని ఆరోపించారు. ఒక్కో అభ్యర్థి నుంచి రూ. 2 లక్షల వరకు వసూలు చేశారన్నారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి అర్హులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు ఆందోళనకారులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలలో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ కలెక్టరేట్ ఏవోకు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో బీవీఎం రాష్ట్ర కార్యదర్శి విఠల్, టీఎస్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు వినోద్, నరేందర్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.



మెడికల్ కాలేజ్ వద్ద ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల ప్రతినిధులు

క్లుప్తంగా

కొలతల ప్రకారం ఉపాధి పనులు చేయాలి



నిజాంసాగర్/లింగంపేట : ప్రభుత్వ కొలతల ప్రకారంగా ఉపాధి పనులు చేస్తే, కూలీ గిట్టుబాటు అవుతుందని మండల ప్రత్యేక అధికారిణి ప్రమీల పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని బ్రాహ్మణపల్లి, అచ్చంపేట గ్రామాల్లో ఉపాధి పనులు ఆమె పరిశీలించారు. జుక్కల్ మండలం పెద్దఎడ్గి గ్రామంలో ఉపాధి పనులను ఎంపీడీవో శ్రీనివాస్ పరిశీలించారు. గ్రామ శివారులో కూలీలు చేపడుతున్న తవ్వకం పనులు, మస్టర్లల్లో హాజరు వివరాలు తెలుసుకున్నారు. పనుల వద్ద నీడ, తాగునీటి సదుపాయంతో పాటు వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం బ్రాహ్మణపల్లిలో చలివేం ద్రాన్ని ఆమె ప్రారంభించారు. లింగంపేట శివారులో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఎంపీడీవో నరేష్ పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీల హాజరు పట్టికలను తనిఖీ చేశారు.నర్సరీలలోని మొక్కలకు ప్రతీ రోజు నీరు పట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏపీవో, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఒకరి భుజాలపై మరొకరిని ఎత్తుకొని

- విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు
- జుక్కల్ మండలం బస్వాపూర్‌లో విద్యుత్ అధికారుల కష్టాలు



నిజాంసాగర్(జుక్కల్): బిచ్కుంద- జుక్కల్ మండలాల పరిధిలో 33 కేవీ లైన్ శుక్రవారం బ్రేక్ డౌన్ అయింది. జుక్కల్ మండలం బస్వాపూర్ వద్ద 33 కేవీ కరెంట్ స్తంభాల బాక్సులు పడిపోవడంతో విద్యుత్ అంతరాయం కల్గింది. దీంతో స్థానిక ఎఎల్ఎంలు శ్రీనివాస్, సాయి, ఎల్ఎమ్ మైపాల్ పంటపొలాల్లో బురద, నీరు నిల్వ ఉండటంతో ఒకరి భుజాలపై మరొకరిని ఎత్తుకొని స్తంభం వరకు వెళ్లారు.పంట పొలాల మధ్య ఉన్న కరెంట్ స్తంభాల కాసారాలను బాగు చేయడంతో పాటు కిందకు జారుకున్న వైర్లను సరి చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

- నిజామాబాద్‌లో నలుగురు, ఆర్మూర్‌లో ముగ్గురు
- ఆర్మూర్‌లో 34 బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ పోతరాజు సాయిచైతన్య



పోలీసులు స్వాధీనం చేసుకున్న బైక్‌లు



నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీపీ పోతరాజు సాయి చైతన్య

ఖలీల్‌వాడి: నిజామాబాద్, ఆర్మూర్‌లోని బెట్టింగ్ ముఠాల గుట్టును పోలీసులు రట్టు చేశారు. జిల్లా కేంద్రంతోపాటు ఆర్మూర్‌లో బెట్టింగ్ ముఠాకు చెందిన మొత్తం ఏడుగురిని పట్టుకున్నారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయ కాన్ఫరెన్స్ హాల్‌లో సీపీ పోతరాజు సాయిచైతన్య శుక్రవారం మీడియాకు వివరాలు వెల్లడించారు. ఈ నెల 3న నగరంలోని ఆటోనగర్ భారతీరాణి కాలనీకి చెందిన షేక్ ముజీబ్ అహ్మద్ ఆన్‌లైన్ బెట్టింగ్ నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఐదో టౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ముజీబ్ అహ్మద్‌తోపాటు బెట్టింగ్ కార్యకలాపాలకు పాల్పడుతున్న షేక్ నదీం, షేక్ జునైద్, షేక్ రహాన్‌ను అరెస్టు చేశారు.

ముజీబ్‌కు రెండేళ్ల క్రితం సాలూర మండలానికి చెందిన షకీల్ ద్వారా నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌కు చెందిన బెట్టింగ్ మాస్టర్ సచిన్ పరిచయమయ్యాడు. ఈజీ మనీకి ఆశపడి ముజీబ్ సచిన్ ద్వారా ఏజెంట్‌గా చేరాడు. సచిన్‌పైన ఉండే సూపర్ మాస్టర్ ద్వారా ఆన్‌లైన్ యూజర్ ఐడీ, పాస్‌వర్డ్ పొందాడు. అనంతరం సుమారు 1000 మంది అమాయకులకు ఆశచూపి బెట్టింగ్‌లోకి దించాడు. యూజర్స్ డిపాజిట్ చేసిన డబ్బు ఏజెంట్ ద్వారా మాస్టర్‌కు చేరి, అనంతరం మాస్టర్ నుంచి ఏజెంట్‌కు 7 శాతం కమీషన్ వస్తుంది. ఇందులో 200 మంది బెట్టింగ్‌కు పాల్పడగా, ఐపీఎల్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు రూ.88 లక్షల లావాదేవీలు జరిగాయన్నారు. ఈ కేసులో సాలూరకు చెందిన షకీల్, ఆటోనగర్‌కు చెందిన షేక్ నజీబ్, నాందేడ్ జిల్లా ధర్మాబాద్‌కు చెందిన సచిన్, ట్రావెల్స్ యజమాని రమేశ్ పరారీలో ఉన్నారని సీపీ తెలిపారు. నిందితుల నుంచి రూ. 50 వేలు, ఐదు సెల్‌ఫోన్లు, రెండు పాసుబుక్‌లు, క్రెడిట్, డెబిట్ కార్డులు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. కేసును ఛేదించిన నార్త్ సీఐ బూక శ్రీనివాస్, టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, ఎస్సైలు గంగాధర్, లక్ష్మయ్యను సీపీ అభినందించారు.

పరారీలో ఐదుగురు..

ఆర్మూర్ పట్టణంలో క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ఎనిమిది మందిని గుర్తించి, ముగ్గురిని అరెస్టు చేసినట్లు సీపీ పోతరాజు సాయిచైతన్య తెలిపారు. హర్యానా రాష్ట్రం మంగ్‌కు చెందిన విపుల్, మహారాష్ట్రలోని బోరికి చెందిన బంటు పలాస్ అలియాస్ శేఖర్, యావత్మాల్‌కు చెందిన బబ్లూ ఠాకూర్, వినాయక్ ఠాకూర్ నిషేధిత బెట్టింగ్ యాప్‌లను వాట్సాప్‌ల ద్వారా ఆర్మూర్‌కు చెందిన గట్టడి గౌతమ్, దయాళ్ సునీల్, జాజు రంజిత్, శ్రీకాంత్ అలియాస్ శ్రీకర్‌లకు పంపించారు. దీంతో ఈ నలుగురు కొన్ని రోజుల నుంచి క్రికెట్ బెట్టింగ్ ఆడుతూ డబ్బులు సంపాదిస్తున్నారు. బెట్టింగ్ ద్వారా వచ్చిన డబ్బును సునీల్ అమాయక ప్రజలకు అధిక వడ్డీలకు ఇచ్చి వారి బైక్‌లను తాకట్టు పెట్టించుకున్నాడు. ఈ నెల 3న సాయంత్రం 4.30 గంటలకు ఆర్మూర్‌లోని గట్టడి గౌతమ్ ఇంట్లో సునీల్, రంజిత్ బెట్టింగ్ ఆడుతుండగా పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 3 సెల్‌ఫోన్లు, రూ.6 వేలు, తాకట్టు పెట్టుకున్న 34 బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్లు సీపీ వెల్లడించారు. కాగా, ఆర్మూర్‌లోని హుస్నాబాద్‌గల్లీకి చెందిన గట్టడి శ్రీకాంత్ అలియాస్ శ్రీకర్‌తోపాటు విపుల్, బంటు పలాస్ అలియాస్ శేఖర్, బబ్లూ ఠాకూర్, వినాయక్ ఠాకూర్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. కేసును ఛేదించిన ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ, టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య, ఎస్సై మహేశ్‌ను సీపీ అభినందించారు.

చి'వరి'కి మెడవిరుపు...

- ఒక వైపు తెగుళ్ల బెడద
- మరోవైపు ఎండుతున్న వరి
- ఆందోళనలో రైతులు

మాచారెడ్డి : మాచారెడ్డి, పాల్వంచ మండలాల్లోని పలు గ్రామాల్లో ఒక వైపు ఎండిన పంటలు, మరో వైపు మెడవిరుపు తెగుళ్లతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రెండు మండలాల్లో కలిపి 22 వేల ఎకరాల్లో వరి పంట సాగైంది. భూగర్భజలాలపైనే ఆధారపడి పంటలు సాగు చేస్తున్న రైతులు బోర్లు ఎత్తిపోయి, దీనికి తోడు ఎండలు పెరిగి పంటలు దెబ్బతిన్నాయి. మెడవిరుపు తెగుళ్లతో మరింత నష్టం జరిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఘన్‌పూర్‌లో మెడవిరుపుతో దెబ్బతిన్న వరి

మూడెకరాలు దెబ్బతింది



ఘన్‌పూర్ (ఎం) గ్రామానికి చెందిన నేను ఐదెకరాల్లో వరి సాగు చేస్తున్నాను. నీరందక ఒక ఎకరం ఎండిపోయింది. ఎండుతున్న పంటను కాపాడుకునేందుకు ఇబ్బందులు పడుతుంటే మరోవైపు మెడవిరుపు తెగుళ్లు సోకి మరో మూడెకరాలు దెబ్బతింది.

– సుదర్శన్‌గౌడ్, రైతు, ఘన్‌పూర్ (ఎం)

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

వాతావరణంలో జరుగుతున్న మార్పులతో పంటలను పలు రకాల తెగుళ్లు ఆశిస్తాయి. అందులో భాగంగానే పంట చేతికొచ్చే దశలో పలు గ్రామాల్లో మెడవిరుపు తెగుళ్లు సోకి పంటలు దెబ్బతిన్నాయి. మెడవిరుపు తెగులుకు ట్రై సైక్లోజోన్, పికాసో స్ట్రోబిన్ కలిపి పిచికారీ చేస్తే మెడవిరుపు తెగులు అదుపులోకి వస్తుంది.

– పవన్, వ్యవసాయాధికారి, మాచారెడ్డి

గ్రూప్ వన్ విజేతకు సన్మానం

మాచారెడ్డి : మండంలోని లచ్చాపేట గ్రామానికి చెందిన భూస ఉదయకిరణ్ ఇటీవల వెలువడిన గ్రూప్ వన్ ఫలితాల్లో 67వ ర్యాంకు సాధించాడు. ఉదయకిరణ్‌ను శుక్రవారం మండలంలోని గజ్యానాయక్‌తండా రైతు వేదికలో ఎమ్మెల్యే వెంకటరమణరెడ్డి సన్మానించారు.





గుంత చింత

జిల్లా కేంద్రమైన కామారెడ్డి పట్టణంలోని కొత్త బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై ఉన్న గుంత ప్రమాదాలకు కారణమవుతోంది. అక్కడ రోజూ ద్విచక్రవాహనదారులు పడిపోతున్నా ఎవరికీ పట్టడం లేదు. గుంతను సరి చేయాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

– సాక్షి ప్రతినిధి, కామారెడ్డి

సేంద్రియ వ్యవసాయంపై రైతులకు శిక్షణ

ఎల్లారెడ్డిరూరల్ : మండలంలోని అడివిలింగాల గ్రామానికి చెందిన రైతు ప్రవీణ్‌కుమార్ రాజస్థాన్‌లోని మౌంట్ అబుకు సేంద్రియ వ్యవసాయంతో చేసే సాగుకు సంబంధించిన శిక్షణ కార్యక్రమానికి వెళ్లినట్లు గ్రామస్తులు శుక్రవారం తెలిపారు. జిల్లా వ్యవసాయ శాఖ ద్వారా జిల్లాకు ఒక రైతు చొప్పున రాజస్థాన్‌కు పంపించారు.



రాజస్థాన్‌లో సాగుపై రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

గుజరాత్‌లో రోబో కింగ్, దర్జి కంపెనీలను సందర్శించిన కాసుల

బాన్సువాడ : గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో రోబోకింగ్, దర్జి కంపెనీలను శుక్రవారం ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ సందర్శించారు. వ్యవసాయానికి సంబంధించిన పలు యంత్రాలు, రోటవేటర్, స్ప్రిడారు, కట్టర్ తదితర పనిముట్లను ఆయన పరిశీలించారు. ప్రభుత్వం నుంచి రైతులు సబ్సిడీలపై వ్యవసాయ యంత్రాలను అందజేయనున్న నేపథ్యంలో గుజరాత్‌కు వెళ్లినట్లు కాసుల పేర్కొన్నారు. ఆయన వెంట ఆగ్రో ఇండస్ట్రీస్ జనరల్ మేనేజర్ యూనుస్ తదితరులున్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి



కామారెడ్డి టౌన్: సైబర్ క్రైం మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పట్టణ సీఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లా కేంద్రంలోని 47వ వార్డులో కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఐపీఎల్ బెట్టింగ్‌లకు పాల్పడవద్దన్నారు. ఆన్‌లైన్‌లో రుణాల జోలికి పోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్‌లు నరేష్, గంగాప్రసాద్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు లక్ష్మినారాయణ, కాలనీవాసులు పాల్గొన్నారు.

బాల్యం ఎప్పటికీ తిరిగిరానిది




బీబీపేట: పాఠశాల బాల్యం జీవితంలో ఎప్పటికీ తిరిగిరానిదని డీఈవో రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని జనగామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వార్షికోత్సవానికి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మెన్ పాత రాజు, హెచ్ఎం ప్రవీణ్‌కుమార్, మాజీ ఎంపీటీసీ రవిందర్‌రెడ్డి, దోమకొండ ఎంఈవో విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మేజర్‌వాడి గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏడో తరగతి విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తోటివిద్యార్థులకు పాఠాలను బోధించారు. అనంతరం పాఠశాలలోని ఆరో తరగతి విద్యార్థులు ఏడో తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం రాజు, ఉపాధ్యాయులు శ్రీనివాస్, శ్రీలత, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల పరిశీలన



బీబీపేట: మండల కేంద్రంలోని పారిశుధ్య పనులను శుక్రవారం మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ పరిశీలించారు. రేషన్ షాపు వద్దకి వెళ్లి సన్నబియ్యం పంపిణీ వివరాలు తెలుసుకున్నారు. అలాగే ఎల్ఆర్ఎస్ గడువును ప్రభుత్వం ఏప్రిల్ 30వ తేదీ వరకు పొడగించినట్లు పేర్కొన్నారు. దరఖాస్తు దారులు ఈ సదావకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీవో అబ్బాగౌడ్, కారోబార్ సిద్దరాములు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ ఒకరి మృతి



జక్రాన్‌పల్లి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై తిరుపతి తెలిపిన వివరాలు ఇలా.. డిచ్‌పల్లి మండలంలోని మెంట్రాజ్‌పల్లి గ్రామానికి చెందిన బైరం రవీంద్ర వర్మ (37) ఈనెల 3న రాత్రివేళ జక్రాన్‌పల్లి మండలంలోని బాలనగర్ 44వ నంబర్ జాతీయ రహదారిపై నడుచుకుంటూ మెంట్రాజ్‌పల్లికి వస్తున్నాడు. ఈక్రమంలో అతడిని గుర్తుతెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటన స్థలాన్ని ఎస్సై తిరుపతి పరిశీలించి, క్షతగాత్రుడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా గురువారం సాయంత్రం రవీంద్ర వర్మ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

విద్యుదాఘాతంతో దూడ..



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని మెల్లకుంటతండాలో విద్యుదాఘాతంతో ఆవుదూడ మృతిచెందింది. తండాలోని మూడ లక్ష్మణ్‌కు చెందిన దూడ శుక్రవారం మేత కోసం వెళ్లి తండాసమీపంలో గల ఎస్ఎస్-2 ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురైంది. దీంతో దూడ అక్కడికక్కడే మృతిచెందింది. సమాచారం అందుకున్న మండల పశువైద్యాధికారి రవికుమార్ ఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించారు. దూడ విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని ఆయన చెప్పారు. బాధిత రైతును ట్రాన్స్‌కో శాఖ ఆదుకోవాలని తండావాసులు కోరుతున్నారు.

ఒకరి మృతి కేసులో 9నెలల జైలు శిక్ష

కామారెడ్డి క్రైం: అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన నిందితుడికి 9 నెలల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ కామారెడ్డి కోర్టు శుక్రవారం తీర్పు వెల్లడించింది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా.. భిక్కనూర్‌కు చెందిన జమ్మగొని పోట్ల ముత్తాగౌడ్ కిరాణ దుకాణం నడుపుతూ జీవించేవాడు. గతేడాది ఓ రోజు రాత్రి అతడు రోడ్డుపై నడుచుకుంటూ వెళ్తుండగా బోయిని స్వామి అనే వ్యక్తి తన ఆటోను అజాగ్రత్తగా నడిపి ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ముత్తాగౌడ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. భిక్కనూర్ పోలీసులు కేసు నమోదు చేసి స్వామిని రిమాండ్‌కు తరలించారు. కోర్టులో నేరం రుజువు కావడంతో కామారెడ్డి కోర్టు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ దీక్ష నిందితుడికి జైలుశిక్ష, జరిమానా విధించారు. సీఐ సంపత్ కుమార్, ఎస్సైలు రాజు, ఆంజనేయులు, పీపీ అశోక్ శివరాం నాయక్, కోర్టు లైజనింగ్ అధికారి మురళి, కానిస్టేబుల్‌రాజశేఖర్ గౌడ్‌లను ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

రామాయంపేట(మెదక్): మెదక్ జిల్లా రామాయంపేట పట్టణ శివారులోని జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో నిజామాబాద్ జిల్లా కేంద్రానికి చెందిన ఓ యువకుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. నిజామాబాద్‌కు చెందిన దేవన్‌పల్లి సాకేత్ (19) తన స్నేహితుడు శివతో కలిసి స్కూటీపై హైదరాబాద్ బయలుదేరాడు. రామాయంపేట శివారులో వారి స్కూటీని వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం వచ్చి ఢీకొట్టింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయాలవడంతో సాకేత్ అక్కడికక్కడే మృతి చెందాడు. శివ తీవ్రంగా గాయపడ్డాడు. సాకేత్ హైదరాబాద్‌లో హోటల్ మేనేజ్‌మెంట్ కోర్సు చదువుతున్నాడు. మృతుడి తండ్రి నాగరాజు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ హత్యకేసులో ఒకరి అరెస్ట్



వివరాలను వెల్లడిస్తున్న సీపీ సాయిచైతన్య

ఖలీల్‌వాడి: ఇటీవల పాంగ్రాలో జరిగిన ఒంటరి మహిళ హత్య ఘటనలో నిందితుడిని పట్టుకొని, అరెస్టు చేసినట్లు సీపీ సాయిచైతన్య తెలిపారు. జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. నగరంలోని పాంగ్రాలో చారుగొండ చంద్రకళ(55) ఒంటరిగా నివసిస్తుండగా, ఆమెకు కల్లు దుకాణంలో కామారెడ్డి జిల్లాలోని హరిజనవాడకు చెందిన శంషాబాద్ విజయ్ అలియాస్ విష్ణు అలియాస్ చింటూ పరిచయమయ్యాడు. గతనెల 23న ఆమె ఒంటిపై ఉన్న బంగారు, వెండి ఆభరణాలను దొంగిలించడానికి ఇంటికి వెళ్లి కల్లు తాగించాడు. అనంతరం ఆమె ఒంటిపై ఉన్న బంగారు చెవికమ్మలు, మాటీలు, వెండి ఆభరణాలతోపాటు సెల్‌ఫోన్‌ను నిందితుడు తీసుకొని, వెంటతెచ్చుకున్న కత్తితో గొంతు కోసి హత్యచేశాడు. అదే గ్రామంలోని ఓ ఇంటి ఎదుట పార్క్ చేసిన బైక్‌పై పారిపోయాడు. కేసు నమోదు చేసి, విచారణ చేపట్టగా, నిందితుడిని పట్టుకున్నట్లు తెలిపారు. అలాగే అతడి వద్ద నుంచి ఏడు గ్రాముల బంగారం, 75 గ్రాముల వెండి, హత్యకు ఉపయోగించిన కత్తి, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కేసును ఛేదించిన సీఐ శ్రీనివాసరాజు, ఎస్సై శ్రీకాంత్, సిబ్బందిని సీపీ అభినందించారు.

వివిధ ఘటనల్లో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అర్ధరాత్రి వరకు వ్యాపార సముదాయాలను తెరిచి ఉంచిన వారికి కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. నగరంలో గురువారం రాత్రి దుకాణ యాజమానులు సయ్యద్ తాజముల(గుల్జర్ పాన్ షాప్), నాదీముల్లా ఖాన్ (ఓల్డ్ పారడైస్ హోటల్), అమీర్ ఖాన్ (పాన్ షాప్, రైల్వేస్టేషన్), షేక్ షాబోద్దీన్, (ఎక్సెంట్ హోటల్, రైల్వేస్టేషన్) వ్యాపారాలు నిర్వహించడంతో పట్టుకున్నామన్నారు. వారిని కోర్టులో హాజరుపర్చగా జడ్జి వారికి రెండు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించినట్లు తెలిపారు. వీరిని జిల్లా జైలుకు తరలించినట్లు తెలిపారు.

బోధన్ పట్టణంలో..

బోధన్‌టౌన్(బోధన్): బోధన్‌లోని గోశాలరోడ్డులో రాత్రివేళ సమయం ముగిసినా హోటల్ నడుపుతున్న నిర్వాహకుడికి బోధన్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ జడ్జి ఒకరోజు జైలు శిక్ష విధించాడని పట్టణ సీఐ వెంకట నారాయణ తెలిపారు. షేక్ ఖాజా అనే వ్యక్తి రాత్రి 10:30గంటల తర్వాత హోటల్ నిర్వహిస్తుండటంతో పోలీసులు పట్టుకొని, బోధన్ కోర్టులో హాజరుపర్చగా జడ్జి జైలు శిక్ష విధించాడన్నారు.

న్యూసెన్స్ కేసులో ఒకరికి..

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని రాజ్‌కుమార్ అనే వ్యక్తి డయల్100కు ఫోన్‌చేసి, న్యూసెన్స్ చేయడంతో అతడిని పట్టుకొని, కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణగౌడ్ శుక్రవారం తెలిపారు. దీంతో ఆర్మూర్ సెకండ్ క్లాస్ జడ్జి అతడికి మూడు రోజుల సాధారణ జైలు శిక్ష విధించినట్లు తెలిపారు.

మట్కా ఆడుతున్న వారికి..

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చి కాంపౌండ్ ఏరియాలో మట్కా ఆడుతున్న ముగ్గురు వ్యక్తులకు కోర్టు రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. గత నెల 22న మిర్చికంపౌండ్‌లో మట్కా ఆడుతున్న షేక్ జునేద్, కాశీపతి, ఇబ్రహీంలను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. అనంతరం వారిని కోర్టులో హాజరు పర్చగా జడ్జి వారికి రెండు రోజుల సాధారణ జైలు శిక్ష, రూ.1000 జరిమానా విధించినట్లు తెలిపారు.

లోన్‌యాప్స్ వేధింపులకు యువకుడి బలి!

సదాశివనగర్(ఎల్లారెడ్డి): లోన్‌యాప్స్ వేధింపులు తాళలేక మండలానికి చెందిన ఓ యువకుడు ఇటీవల ఆత్మహత్యకు పాల్పడగా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా.. సదాశివనగర్‌కు చెందిన నిమ్మలబోయిన సందీప్ (29) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుంటా డు. ఐదు నెలల క్రితం వివాహం చేసుకొని అక్కడే కాపురం పెట్టాడు. ఈక్రమంలో లోన్ యాప్‌లో అ ప్పులు తీసుకోవడంతో వాటిని తీర్చాలని ఏజెంట్లు ఇంటికి వచ్చి ఒత్తిడి చేశారు. దీనికితోడు స్టాక్ మా ర్కెట్‌లో పెట్టుబడులు పెట్టగా నష్టాలు వచ్చాయి. దీంతో సందీప్ కలత చెందాడు. అప్పులు తీర్చే మార్గంలేకపోవడంతో సందీప్ రెండురోజుల క్రితం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కామారెడ్డి క్రైం: కామారెడ్డి పెద్ద చెరువులో ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో చెరువులో మృతదేహం తేలడంతో స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దేవునిపల్లి ఎస్సై రాజు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీయించారు. మృతుడి వయస్సు 50 సంవత్సరాల వరకు ఉంటుందనీ, అతని వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు. చెరువు గట్టుపై బట్టలు ఉంచి స్నానం చేయడానికి చెరువులో దిగి, ప్రమాదవశాత్తు నీటమునిగి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. ఎవరైనా మృతుడిని గుర్తుపడితే దేవునిపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

శివాజీ విగ్రహావిష్కరణపై వివాదం

మోర్తాడ్(బాల్కొండ): ఏర్గట్ల మండల కేంద్రంలో ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ కార్యక్రమం వివాదానికి దారి తీసింది. ఏర్గట్లకు చెందిన కొన్ని యువజన సంఘాలు ప్రజల నుంచి విరాళాలు సేకరించి శివాజీ విగ్రహాన్ని తయారు చేయించాయి. బస్టాండ్ ప్రాంతంలోని తెలంగాణ తల్లి విగ్రహం పక్కన శివాజీ విగ్రహాన్ని నిలిపిఉంచారు. శుక్రవారం ఉదయం విగ్రహాన్ని ఆవిష్కరించి గద్దె నిర్మాణం పనులు ప్రారంభించారు. కానీ పోలీసులు వచ్చి విగ్రహం ఏర్పాటుకు ఎలాంటి అనుమతులు లేవని పనులను అడ్డుకున్నారు. ఎవరి అభ్యంతరం లేకపోయినా పోలీసులు అడ్డుకోవడంపై స్థానికులు నిరసన తెలిపారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, ఇతర పోలీసు అధికారులు స్థానికులతో చర్చలు జరిపారు. 10 రోజుల్లో అనుమతి తీసుకోవాలని సూచించి, విగ్రహానికి ముసుగువేశారు. అనుమతి తీసుకున్న తర్వాతనే విగ్రహానికి ఉన్న ముసుగు తొలగించడానికి యువజన సంఘాల సభ్యులు అంగీకరించడంతో వివాదం ముగిసిపోయింది. ఇదిలా ఉండగా ఆవిష్కరించిన రోజునే శివాజీ విగ్రహంపై ముసుగు వేయడం కాకతాళీయంగా చోటు చేసుకుంది.



ఏర్గట్లలో పోలీసులతో స్థానికుల వాగ్వాదం



శివాజీ విగ్రహానికి వేసిన ముసుగు